
ప్రజాశక్తి

బుధవారం 6 మార్చి 2024

5

పార్వతీపురం మన్యం



ఫిజియోథెరపిస్ట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

భవిత కేంద్రంలో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్ట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయ కర్త జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిజియోథెరఫిస్ట్‌గా హైర్ బేసిస్, అవర్ బేసిస్‌లో పనిచేసేందుకు ఇంటర్మీడియట్‌తో పాటు బిపిటి, ఎంపిటి అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.12 వేలు గౌరవ వేతనం చెల్లిస్తామన్నారు. ఫిజియోథెరపిస్ట్ కు మూడు మండలాలు కేటాయించడం జరుగుతుందని, మండలానికి 4 క్యాంపుల చొప్పున మూడు మండలాలకు 12 క్యాంపులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 7 సాయంత్రం 5 గంల్లోపు కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.



వేడెక్కిన కురుపాం రాజకీయం

- ఒకవైపు సమావేశాలు... మరోవైపు ప్రచారాలు
- టిడిపిలో నేటికీ కలవని గ్రూపులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొలదీ కురుపాం నియోజకవర్గంలో రోజురోజుకు ఎన్నికల వేడి హీటెక్కుతుంది. ఒకవైపు టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముఖ్యంగా ఎమ్మెల్యేలు ఎక్కువ శాతం మెజార్టీతో గెలుస్తున్న గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువవుతున్నారు. అనేక ఏళ్ల తర్వాత ఒక గిరిజన బిడ్డకు అవకాశం వచ్చిందని, తనను గుర్తించి ఎమ్మెల్యేగా గెలిపించాలంటూ జగదీశ్వరి అభ్యర్థిస్తున్నారు. మరోవైపు కురుపాం వైసిపి ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి కూడా రానున్న ఎన్నికల్లో ముచ్చటకు మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపు కోసం వ్యూహ రచన చేస్తున్నారు. ఐదు మండలాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, జడ్పిటిసిలు, గృహ సారథులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పార్టీ అనుకూల, ప్రతికూల పరిణామాలు తెలుసుకుంటూ వాటిని సరి చేసే పనిలో ఉన్నారు. కొన్ని మండలాల్లో వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు పుష్పశ్రీవాణి ఎమ్మెల్యేగా గెలవాలంటూ పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఎన్నికలు సమీపిస్తున్నా కురుపాంలో టిడిపి నేటికీ రెండు గ్రూపులుగానే పనిచేస్తుంది. ఇది రానున్న ఎన్నికలకు చాలా ఇబ్బందికర పరిస్తితులు తీసుకువచ్చేలా ఉందని ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ ఈ సమస్యపై అధిష్టానం దృష్టి సారించకపోవడంతో గ్రూపుల ఎడబాటుతో టిడిపిలో తడబాటు తప్పదని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు కలిసికట్టుగా ఉన్న కొందరు నాయకులు కూడా టిడిపి, జనసేన ఉమ్మడి జగదీశ్వరి ఎన్నికల ప్రచారంలో కనిపించడంలేదు. స్థానికంగా ఉన్న నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో ఆమె దూకుడు పెంచారు. మొన్నటి వరకు ఎమ్మెల్యే టికెట్ కోసం ఆశించిన రెండో వర్గం ఆశావాహులు, నాయకులు రానున్న ఎన్నికలకు ఏం చేయాలనే ఆలోచనతో ఎన్నికల భవిష్యత్ కార్యాచరణ ఆలోచనతో ఉన్నారు. నేటి వరకు అధిష్టానం తమను ఎందుకు గుర్తించలేదని, గ్రూపులను కలిపే ఆలోచన కూడా ఎందుకు చేయలేదని గుర్రుగా ఉన్నారు.

మొన్నటి వరకు టిక్కెట్ ఆశించిన కురుపాం వైరిచర్ల వీరేష్‌దేవ్ కూడా సైలెంట్ గానే ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆశావాహులు ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరితో కలిసి పనిచేస్తారా? లేదా ప్రత్యామ్నాయ మార్గం పోటీలో నిలబడతారా? అనే ప్రశ్నలు ప్రస్తుతం ప్రజల్లో చర్చ వినిపిస్తోంది. మొదటి నుంచి కురుపాంలో టిడిపి రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఆరోపణలకు దిగుతుంటే వైసిపిలో ఆ సమస్య లేకపోవడంతో ప్రశాంతంగా ఎన్నికలకు వెళ్తున్నారు. ఏది ఏమైనా టిడిపిలో గ్రూపులు కలిస్తేనే రానున్న ఎన్నికలకు వైసిపికి గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నారు. లేదంటే మూడోసారి కూడా వైసిపి గెలుపు సులభతరమవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ కూటమితో ఎమ్మెల్యే అభ్యర్థిని బరిలోకి దించనున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ కురుపాం నియోజకవర్గం ఇంకెంతమంది ఎమ్మెల్యే బరిలో నిలవనున్నారో వేచి చూడాల్సిందే.

పోలీసులకు రక్షణ ప్రభుత్వ బాధ్యత

డిప్యూటీ సిఎం రాజన్న దొర

ప్రజాశక్తి - కురుపాం/జియ్యమ్మవలస

ప్రజలకు మంచి జరగాలంటే పోలీసులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పి.రాజన్న దొర అన్నారు. జియ్యమ్మవలస మండలం చినమేరంగిలోనూ, కురుపాం మండలం కురుపాంలో ఒక్కొక్కటి రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీసు స్టేషన్లను, కురుపాంలో గల శివన్నపేటలో రూ.12 కోట్లతో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను రాజన్నదొర మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల కోసం అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసుశాఖ కీలక పాత్ర పోషిస్తుందని, అటువంటి పోలీస్ వ్యవస్థకు మంచి మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అత్యవసరమైన ఆ దిశగా ఆధునాత రంగాలతో కూడిన పోలీస్ భవనాలను ప్రభుత్వం నిర్మించిందన్నారు.



ఏకలవ్య పాఠశాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తున్న రాజన్నదొర

గిరిజన విద్యార్థులకు వరం ఏకలవ్య పాఠశాల

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి పాఠశాల రూపురేఖలు మార్చి నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తుందని రాజన్నదొర అన్నారు. ఇందులో భాగంగా కురుపాంలో గిరిజన విద్యార్థులకు రూ.12 కోట్ల వ్యయంతో ఏకలవ్య పాఠశాల నిర్మించినట్టు తెలిపారు. గిరిజన విద్యార్థులు విద్యాభివృద్ధి చెందడమే లక్ష్యంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని గ్రామాలకు రహదారులు, తాగునీరు, తదితర మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తు న్నామని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ పట్నం రేంజ్ డిఐజీ విశాల్ గున్నీ, కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, ఎఎస్‌పి డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వర రావు, జిల్లా వైసిపి అధ్యక్షులు ఎస్.పరీక్షిత్‌రాజు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి - సీతంపేట

నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. మంగళవారం పాలకొండ డిఎస్పీ, సిఐ, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక కవాతు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి కృష్ణారావు, సిఐ చంద్రమౌళి, ఎస్ఐలు జగదీష్‌నాయుడు, అనిల్‌కుమార్, తహశీల్దార్లు మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

ఓటర్ల జాబితాకు సంబంధించి వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలపై విచారణ చేపట్టి తప్పులను సరిదిద్దామని పిఒ తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. పోలింగ్ సమయానికి అన్ని పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత

జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ క్రీడాకారులకు పిఒ కల్పనకుమారి క్రీడా పరికరాలను అందజేశారు. హాకీ, వాలీబాల్, ఆర్చరీ క్రీడాకారులు 20 మందిరి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ క్రీడాపరికరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. క్రీడా పరికరాలను గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో భద్రపరిచి క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని స్పోర్ట్స్ ఇంచార్జ్‌కు సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్‌దయానంద్ తదితరులు పాల్గొన్నారు



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పిఒ కల్పనాకుమారి

తప్పుడు ఆరోపణలతో పరువు తీస్తున్నారు

కలెక్టర్, ఎస్‌పిలకు సంధ్యారాణి ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

తన కులంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, ఎమ్మెల్యే అభ్యర్థి జి.సంధ్యారాణి కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో ఆమె నేరుగా కలెక్టర్, ఎస్పీలను కలిసి ఫిర్యాదు అందజేశారు. పదేపదే తాను ఎస్టీ కాదంటూ తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న చెల్లూరి జోగయ్య, ఆయనతో చేయిస్తున్న న్యాయవాది రేగు మహేష్‌పై ఆమె ఫిర్యాదు చేశారు. 1999, 2009 ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు తన ప్రత్యర్థి, ఇప్పటి డిప్యూటీ సిఎం రాజన్నదొర న్యాయవాది రేగు మహేష్ తాను ఎస్టీ కాదని పేర్కొంటూ ఫిర్యాదులు చేశారని చెప్పారు. ఎన్నికల సమయంలోనే తాను ఎస్టీ కాదని ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక తన కులంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వృద్ధురాలైన తన తల్లిని, తనను మానసిక క్షోభకు గురి చేస్తూ తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ ఫిర్యాదులు వెనుక ఎవరు వున్నారో తేల్చి తగిన చర్యలు తీసుకోవాలని సంధ్యారాణి కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న చంద్రశేఖర్ కల్కూర

ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి అని రాష్ట్ర గ్రంథాలయ సంఘం అధ్యక్షులు కె.చంద్రశేఖర్ కల్కూర అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం పార్వతీపురం శాఖ పాఠ్యాంశాలలో ప్రకతి వ్యవసాయం - ప్రాధాన్యత అనే అంశంపై వాసవీ కళాశాలలో మంగళ వారం సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ ఆరోగ్యం కాపాడుకోవాలని, ఇందుకు జీవన శైలి మార్పుతో పాటు ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలు అవసరమని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంతో భూసంరక్షణే కాకుండా సమస్త జీవకోటిని రక్షించుకోగలమని పేర్కొన్నారు. యువత వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని కోరారు. పాడి పంట సమాజానికి అవసరమని చెప్పారు. విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని, అది అలవాటు కావాలని సూచించారు. పుస్తక పఠనంతో మేధస్సు పెరుగుతుందని, మంచి స్నేహితునిలా అండగా ఉంటుందన్నారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి దిట్టకవి చక్రపాణి మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రకృతి వ్యవసాయంపై గొప్ప సేవలు అందించారన్నారు. ప్రపంచ విజ్ఞానం తెలుసుకోవాలనే జిజ్ఞాస విద్యార్థులకు ఉండాలని కోరారు. వార్తా పత్రికలు చదవాల్సిన అవసరం ఉందని, గొప్ప స్థాయికి చేరుటకు ఆలోచించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి డా ఎంవిజి కృష్ణాజీ, డిపిఆర్ఒ లోచర్ల రమేష్, గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి టి.శివ కేశవ రావు, ఉపాధ్యక్షులు డి.పారినాయుడు, వాసవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పివికె మనికుమార్, గ్రంథాలయ సంఘం జిల్లా కార్యదర్శి నల్లా బాలకృష్ణారావు, ఉపాధ్యక్షులు బడే సత్యనారాయణ, సలహాదారు తుంబలి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిఎస్‌సి కోసం10న మన్యం బంద్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్పెషల్ డిఎస్‌సి పై ప్రభుత్వం ఈనెల 9 లోపు ఆర్డినెన్స్ జారీ చేయకుంటే 10న మన్యం బంద్ నిర్వహిస్తామని యుటిఎఫ్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం గుమ్మలక్ష్మీపురంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జనరల్ డి.ఎస్.సి నోటిఫికేషన్‌లో షెడ్యూల్ ఏరియాలో కేవలం 38 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ఆదివాసిలకు కేటాయించడం దారుణమన్నారు. ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆదివాసీ మాతృభాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తిక శంకర్రావు, పత్తిక ప్రసాదరావు, గౌరవ అధ్యక్షులు చలపతిరావు, కురుపాం మండల అధ్యక్షులు మూటక చలపతి రావు తదితరులుగా ఉన్నారు.

డంపింగ్‌యార్డు ఏర్పాటును అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పార్వతీపురం మున్సిపాలిటీకి సంబంధించిన డంపింగ్ యార్డును మండలం సుంకి రెవెన్యూ పరిధిలోని తోటపల్లి ప్రాజెక్టు సమీపాన పాత కాలువ గట్టుపై ఏర్పాటు చేయడానికి అధికారులు పనులు ప్రారంభించడం పట్ల సిపిఎం తీవ్ర అభ్యంతర వ్యక్తం చేస్తూ మంగళ వారం పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బివి రమణ, సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఒక పక్క చెబుతూనే, మరోవైపు మున్సిపాలిటీ చెత్తను ఇక్కడకు తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మెయిన్ రోడ్డుకు ఆనుకొని విలువైన వ్యవసాయ భూములు ఉన్నచోట డంపింగ్ యార్డ్ ఎలా పెడతారని ప్రశ్నించారు. సుంకి, సంతోషపురం, మరుపెంట, నాగూరు, చిలకాం, శివ్వాం తదితర గ్రామ పంచాయతీల ప్రజలు వ్యవసాయ, వ్యవసాయేతర అవసరాలకు ఈ నాగావళి నది నీటిపై ఆధారపడుతున్నారని, ఈ డంపింగ్ యార్డ్ వల్ల నీరు కలుషితమై ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యలు వాల్టా చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు తమ అనాలోచిత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని,. ప్రారంభించిన పనులను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు చేస్తున్న ఈ చర్యల పట్ల కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి స్పందించాలని, కురుపాం నియోజకవర్గ ప్రజలకు నష్టం చేకూర్చే చర్యలను నిలుపుదల చేయించాలని, లేకుంటే ఆమె భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆందోళనలో సుంకి, సంతోషపురం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



డంపింగ్‌యార్డు పనులను అడ్డుకున్న గ్రామస్తులు, సిపిఎం నాయకులు



శిక్షణలో మాట్లాడుతున్న డిపిఒ సత్యనారాయణ

నాణ్యతా ప్రమాణాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పంచాయతీలలో జరిగే పనులపై వినియోగించే వస్తువుల నాణ్యత ప్రమాణాలపై ప్రజాప్రతినిధులకు, సర్పంచులకు, పంచాయితీక ార్యదర్శులకు అవగాహన ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నాణ్యత ప్రమాణాలపై జిల్లా వ్యాప్తంగా సర్పంచులకు, కార్యదర్శులకు అవగాహన కల్పించేందుకు నాలుగు రోజులపాటు వర్క్ షాపు నిర్వహించారు. మంగళవారం రెండో రోజు వర్క్ షాపును పరిశీలించిన ఆయన భారత ప్రమాణాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గ్రామస్థాయికి తీసుకు వెళ్లడానికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ పంచాయతీరాజ్ శాఖతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ వర్క్‌షాపు ద్వారా ఐఎస్ఐ, హాల్ మార్క్ వంటి నాణ్యతా ప్రమాణాల ప్రాముఖ్యతతో పాటు వాటి పరిధిలో వచ్చే వస్తువుల వినియోగం గురించి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన పెంపొందించుకొని ప్రజలకు తెలియజేయా లన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం మార్చి 7 వరకు నిర్వహిస్తామన్నారు. అనంతరం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హైదరాబాద్ సౌత్ జోన్ జాయింటు డైరెక్టరు సుజాత, భారత ప్రమాణాల ప్రాధాన్యతను వాటి పరిధిలోకి వచ్చే వస్తువులను, హాల్ మార్కు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిడిఒ అకిబ్ జావేద్, డిఎల్‌పిఒ ఎం.నాగభూషణ, డిపిఆర్‌సి ట్రైనింగ్ మేనేజరు ఎ.దేవుడు, ఆర్‌పిలు ఎ.గణపతి, ఎం.రఫీ, వెంకటరమణ, డిఎల్‌సి పి.అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

సినీనటుడు సుమన్

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని సినీ నటుడు సుమన్ అన్నారు. మండలంలోని కత్తులకవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మనబడి, నాడు నేడు కింద పాఠశాలల అభివృద్ధి చేయడంతో పాటు అమ్మ ఒడి, విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక వంటి పథకాలు అందజేసి బడుగు, బలహీన వర్గాలకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చేరి ఉన్నత శిఖరాలు అవలంభించాలని విద్యార్థులకు సూచించారు. మరి కొద్ది రోజుల్లో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందాలని సూచించారు. అలాగే గ్రామంలో సత్యసాయిబాబా మందిరాన్ని సందర్శించారు. సత్యసాయి బాబా మందిర అభివృద్ధికి తమవంతు రూ.30లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈ గ్రామానికి గతంలో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు ఆర్థిక సహాయ సహకారాలు అందించినట్లు ఆయన తెలిపారు. అంతకుముందు విద్యార్థులు వివిధ రకాల అలంకరణకు స్వాగతం వివిధ రకాల అలంకరణకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న సినీనటుడు సుమన్

7న ఎస్‌టి కమిషన్ చైర్మన్ రాక

ప్రజాశక్తి- సీతంపేట

ఈ నెల 7న ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు సీతంపేట ఐటిడిఎలో పర్యటించనున్నట్లు డిడి అన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో మిలియపుట్టి మండలంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులతో వారి సమస్యల పై సమీక్ష జరిపి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారని, ఏరియా హాస్పిటల్ సందర్శిస్తారని, అనంతరం అధికారులతో మీటింగ్, ఐటిడిఎలో నిర్వహిస్తారని తెలిపారు.

మిమ్స్ ఉద్యోగులకు వెల్లువెత్తిన మద్దతు

- నిరసన శిబిరానికి తరలివచ్చిన పలు గ్రామాల నాయకులు, ప్రజలు
- ఉద్యోగుల ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న న్యాయ పోరాటానికి పార్టీలకతీతంగా మద్దతిస్తామని వైసిపి, టిడిపి, జనసేన, సిపిఎం, సి పి ఐ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న పోరాటం మంగళ ావారానికి 34వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సంఘీభావ సభ శిబిరం వద్ద జరిగింది. అన్ని పార్టీల నుంచి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు హాజరై మాట్లాడారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనుమల్ల వెంకటరమణ, నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్, పూసపాటిరేగ ఎఎంసి చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, చిక్కాల సంతోష్ చిక్కాల సుమతి , టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు, కౌన్సిలర్లు అవనాపు సత్య నారాయణ, మజ్జి అన్నపూర్ణ, నరవ రామలక్ష్మి, మైపాడ ప్రసాద్, బూర సుజాత, కింతాడ కళా వతి, నాయకులునల్లి చంద్రశేఖర్, నాయకులు లెంక అప్పలనాయుడు, రాజి నాయుడు, సత్యనారాయణ, జనసేన నాయకులు నాని, శ్యామల రావు, సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, సిపిఐ నాయకులు మొయిధ పాపారావు, అడ్వకేట్ కె.సన్యాసిరావు, పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొని మద్దతు తెలిపారు. ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని ప్రకటించారు. యాజమాన్యం వెంటనే సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి మిమ్స్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అన్నారు. లేదంటే భవిష్యత్తులో మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు నిర్వహించే పోరాటాలకు తాము కూడా మద్దతు ఇచ్చి వారి వెంటే ఉంటామని ప్రకటించారు. కార్యక్రమంలో మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పాల్గొన్నారు. నిరసన శిబిరానికి నగర పంచాయతీ 7వవార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.



శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి
www.prajasakti.com



టేకు ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డిఎఫ్‌ఒ ప్రసూన

టేకు ప్లాంటేషన్ పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గుమ్మడ సమీపాన గల బగ్గ టేక్ ప్లాంటేషన్‌ను జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసూన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు. రెండున్నర కిలోమీటర్ల మేర ఫైర్ లైన్ ఏర్పాటు చేశామని డిఎఫ్ఒకి సిబ్బంది వివరించారు. టేక్ ప్లాంటేషన్‌లో అగ్ని ప్రమాదాలు జరగకుండా అటవీ సంపద నష్టపోకుండా ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అటవీ సంపదను సంరక్షించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సబ్ డిఎఫ్ఒ ఎల్.సంజయ్, పాలకొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.తవిటి నాయుడు, ఫారెస్ట్ బీట్ అధికారి దాలినాయుడు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సాగుదారులకు పట్టాలు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని వెంకటరాయుడిపేట పంచాయతీలో ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న సాగుదారులకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో బికెటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా డి-పట్టా భూములను సాగు చేసుకుంటూ వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు వారి అభ్యర్థన మేరకు వారి పేరిట వ్యవసాయ భూమి మంజూరు పత్రాలను తయారుచేసి వారికి వ్యవసాయం కోసం ప్రభుత్వ భూమికి సంబంధించి ఈ పట్టాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింత వెంకట నాయుడు, నాయకులు, పట్టా దారులు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షా పేపర్లను భద్రం చేస్తున్న విద్యాశాఖాధికారులు

పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న టెన్త్ పరీక్షా పత్రాలు

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 18 నుంచి జరగబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్ష పేపర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌కు మంగళవారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఇఒ జి.సూర్యదేవుడు మాట్లాడుతూ సీతానగరం, బూర్జ, జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ పరీక్షా కేంద్రాలుగా ఉన్నాయన్నారు. ఈ పరీక్ష కేంద్రాలకు సంబంధించి పేపర్లు పోలీస్ స్టేషన్లో ఉంచామన్నారు. కార్యక్రమంలో సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసన్నలక్ష్మితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

నియోజకవర్గ స్థాయిలో బలిజిపేట మండలానికి సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.260 కోట్లు ఇంత వరకు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన పేదలందరికీ ఇళ్లు పట్టాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి పేదవాడి ఇంటికల నెరవేర్చడంలో భాగంగా మండలంలోని 739 పట్టాలు పంపిణీ చేయగా 660 మందికి ఇంతవరకు రిజిస్ట్రేషన్లు జరిగాయని వాటిని ఇప్పుడు అందిస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్‌పిటిసి అలజంగి రవికుమార్, వైస్ ఎంపిపి వేంటి సాయిరాం, తహశీల్దార్ జివి జనార్దన్, ఎంపిడిఒ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తమ గ్రామాలకు పక్కా రహదారుల నిర్మాణం చేయాలని, సురక్షితమైన తాగునీరు అందించాలని కొమరాడ మండలం రెల్ల, వనధార గిరిజన గ్రామాలకు చెందిన యువకులు కోరారు. ఈమేరకు మంగళవారం గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్‌తో కలిసి ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన రోడ్డు లేక నానా అవస్థలు పడుతున్నామన్నారు. కనీసం తాగడానికి సురక్షితమైన తాగునీరు లేదని వాపోయారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో మల్లేసు, సూరి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి... పర్యావరణం రక్షించండి

ప్రజాశక్తి - పార్వతీపురం

మొక్కలు నాటండి పర్యావరణాన్ని రక్షించండి అంటూ శ్రీ సాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థులు అడ్డాపుశీలలో మొక్కలు నాటి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ క్యాంపు ఐదో రోజు కార్యక్రమంలో భాగంగా అడ్డాపుశీలలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ పోలమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరోగ్యేంద్రం దగ్గర, పాఠశాల ఆవరణ, గ్రామ శివారు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. తరగతి గదిలో పిల్లలకు మొక్కలను సంరక్షించడం వల్ల జరిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పెంట అప్పారావు, ప్రిన్సిపాల్ జి. శ్రీధర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ అధికారులు డి.దేవి, తిరుపతిరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ కృష్ణరాయపురం, వెంకటాపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఇఆర్ఒకి కెకె కుమార్ వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఉండాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు జరక్కుండా ఉండాలని సూచించారు. ముందుగా ఓటర్ అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ బిఎల్ఒలు, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి యాత్ర

ప్రజాశక్తి - భామిని

మండల కేంద్రమైన భామినిలో శ్రీ ఉమారామలింగేశ్వర యాత్ర మహోత్సవాలు మార్చి 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నామని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు కుంకుమ పూజలు, రెండో రోజు తిరువీధి, చక్ర తీర్థ స్నానాలు, స్వామి వారి కల్యాణం, చివరి రోజు లింగధారణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రెండు, మూడవ రోజుల్లో ఆలయం ప్రాంగణంలో అన్నదానం ఉంటుందని అన్నారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పెరటి తోటలపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రసాయనాలు లేకుండా పండించే పెరటి తోట కాయగూరల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా వైద్యాధికారి బి.జగన్నాధరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య సమావేశ భవనంలో సెర్ప్, ఆర్‌వైఎస్ఎస్ సంయుక్తంగా మండలానికి ముగ్గురు వెలుగు విఒఎలను గుర్తించి వారికి కృషి సఖి పేరిట శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఎంహెచ్ఒ మాట్లాడుతూ సహజ సిద్ధమైన పోషకాలతో కూడిన కూరగాయలు, ఆకుకూరలను స్వయంగా ఇంటి పెరటి లోనూ, మిద్దెతోటలపై పండించుకొని వినియోగించుకోగలిగితే పరిపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చునని తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కృషి సఖిలకు ప్రకృతి వ్యవసాయంపైనా, హెల్త్ అండ్ న్యూట్రిషన్, కిచెన్ గార్డెన్స్, ప్రకృతి వ్యవసాయ ఇన్పుట్స్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిడి సత్యంనాయుడు, ఎల్‌హెచ్‌డి పిఎం ప్రవీణ్, ఆర్‌టిఒ హేమ సుందరరావు, డిపిఎం షణ్ముఖ రాజు, ఎన్ఎఫ్ఎ దేవీప్రసాద్, మాస్టర్ ట్రైనీ శ్రీరాములు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

జీడి రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని జీడి పరిశ్రమలను వెంటనే ఏర్పాటు చేసి ఆ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఇప్పటికే వర్షాలు పడకపోవడం వల్ల జీడి రైతులు మొక్కలకు ఎటువంటి మందులు వేయాలి, పంటల దిగుబడికి ఏం సంరక్ష చర్యలు తీసుకోవాలి, పువ్వు, పిందె సమయంలో ఎటువంటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్న విషయాలు ఉద్యానశాఖ అధికారులు ఏ గిరిజన గ్రామానికి వెళ్లి సూచనలు, సలహాలు ఇవ్వని పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం, ఐటిడిఎ నుండి గతంలో మాదిరిగా ఎరువులు, క్రిమిసంహారక మందులు కూడా రావడంలేదన్నారు. గత ఏడాది గిరిజన రైతులు జీడి పిక్కలు బాగా పండించినప్పటికీ దళారులు కేజీ రూ.60 నుంచి రూ.120 వరకు కొనుగోలు చేశారన్నారు. కావున జీడి రైతులు మోసపోకుండా అన్ని విధాలా ఆదుకునేలా వెంటనే జీడీ పప్పు ఫ్యాక్టరీని ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో 8 మండలాల జీడి పండించిన రైతులందరితో కలిసి పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న వేతనదారులు

నేటి నుంచి క్రాష్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలో బుధవారం నుండి 20 రోజుల పాటు క్రాష్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అకిబ్ జావేద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.ఐదు లక్షల నిధులతో మండలంలోని 30 పంచాయితీల్లో గల 581 చేతిపంపులను పరిశీలించి అవసరమైన మేరకు మరమ్మతులు చేస్తామన్నారు. తద్వారా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి పనుల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధి హామీ పనుల వద్ద వేతనదారులకు తాగునీరు, టెంట్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు అధికారులకు కోరారు. మండలంలోని వలసబల్లేరు పంచాయతీలో గల వలసగూడ వద్ద జరుగుతున్న ఉపాధి పని వద్దకు మంగళవారం వెళ్లి వేతనదారులతో కలిసి నిరసన తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలు చేసి కూలీలను ఆదుకోవాలని, కేరళ తరహాలో రూ.600 రోజు కూలి చెల్లించి ఉపాధి హామీని పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా గిట్టుబాటు వేతనం లేక కూలీలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే పని ప్రదేశాల వద్ద మంచినీరు, మజ్జిగ, టెంట్లు వేయాలని, పారలు, గుణపాలు, మెడికలు కిట్లు ఇచ్చేలా చర్యలు చేపట్టి మేట్లకు, వేతనదారులకు వేసవి అలవెన్సులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి.శివాజీరావు బి.తుంబు, బిడ్డిక తేజారావు. ఆరిక మణిభూషణ, పలువురు వేతన దారులు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

దేశంలో ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చి, ఎన్నికల్లో మెప్పు పొందాలని బిజెపి చూస్తుందని, ఆయన సిఫార్సులను అమలు చేసి గౌరవించాలని సిపిఎం నాయకులు విమర్శించారు. ఈ మేరకు మండలంలోని తాళ్ల బురిడీ, అడ్డాపుశిల, బంటువానివలసల్లో ప్రచారం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బంటుదాసు, సంతోషం శంకర్రావు శివుని నాయుడు నాగభూషణ మాట్లాడారు. దేశంలో రైతాంగ సమస్యలపై అధ్యయనం చేసి, రైతుకు న్యాయం జరగాలంటే మద్దతు ధరకు చట్టం చేయాలని, కేంద్రానికి స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిందని, ఆ సిఫార్సులను బిజెపి తుంగలో తొక్కిందని, రైతాంగం ఢిల్లీ సరిహద్దుల్లో వ్యవసాయ సంస్కరణల వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని పోరాడుతుంటే, వాటిల్ని పట్టించుకోని మోడీ ఓట్ల జిమ్మిక్కులు చేస్తూ, స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించిందని తెలిపారు. బిజెపికి, ప్రధాని నరేంద్ర మోడీకి చిత్తశుద్ధి ఉంటే స్వామినాథం చేసిన సిఫార్సులను ఇప్పటికైనా అమలు చేయాలని, బిజెపి వెనుక వెంపర్లాడుతున్న జనసేన, టిడిపి, వైసిపిలను వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా వారి మోసాన్ని అర్థం చేసుకుని, ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రైతాంగ హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేసే వరకు రైతులు, ప్రజలను కలుపుకొని ఆందోళన ముందుకు తీసుకు వెళ్తామని, రైతాంగమంతా సిద్ధపడాలని కోరారు.

టిడిపి నాయకుడు త్వరలో వైసిపిలోకి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణానికి చెందిన కీలక టిడిపి నాయకుడు త్వరలో వైసిపి తీర్థం పుచ్చుకోనున్నారు. గత కొంతకాలంగా ఊగిసలాటలో ఉన్న ఆయన అధికారపార్టీ లో చేరడానికి రంగం సిద్ధమైంది. ఈమేరకు డిప్యూటీ సీఎం రాజన్నదొర సమక్షంలో చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. పట్టణానికి చెందిన కొంతమంది నాయకులు ఆయన చేరికపై అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఇంతవరకు జాప్యం జరిగింది .రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపు అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ టిడిపి నాయకుడి చేరికకు అడ్డు చెప్పొద్దని రాజన్నదొర వైసిపి నాయకులకు నచ్చజెప్పినట్లు తెలిసింది. ఆయనతో పాటు ఆయన అనుచరులందరినీ తీసుకుని రావాలని వైసిపి పట్టణ నాయకులు షరతు పెట్టడంతో దానికి ఆయన అంగీకరించారు. దీనికి సంబంధించి త్వరలో ముహూర్తం ఖరారు చేయనున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవిని దృష్టిలో పెట్టుకుని గిరిజన గ్రామాల్లో గల చిన్నారుల్లో రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి ఎంపిడిఒ జి.జగదీష్ కుమార్ సూచించారు. మండలంలోని డుమ్మంగి, కుక్కిడి గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన కన్వర్జెన్సీ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ కార్యదర్శులు రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖల సిబ్బంది గ్రామాల్లో చిన్నారుల్లో రక్తహీనత, ఎనీమియా వ్యాధి లేకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి మండలంలోని మండల శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు చెందిన సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది వారికి నిర్దేశించిన గ్రామాలకు వెళ్లి 0-1 సంవత్సరాల లోపు చిన్నారులను దత్తత తీసుకొని వారి బాగోగులను చూడాలని అన్నారు. అలాగే తాడికొండ, రేగిడి, దుడ్డుకల్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది, ఎఎన్ఎంలు, హెల్త్ సూపర్వైజర్లు కూడా అప్రమత్తంగా ఉండి ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి శుభ్రంగా ఉంచాలని తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా తక్షణమే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి వైద్యం అందించాలని కోరారు. ముఖ్యంగా గర్భిణులకు తగు సూచనలు, సలహాలు అందించి సుఖప్రసవాలు అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో పలువురు వైద్య సిబ్బంది, భద్రగిరి ఐసిడిఎస్ సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత గర్భిణీలను గుర్తించాలి

సీతానగరం : రక్తహీనత గర్భిణీలను ముందుగా గుర్తించి ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పేర్లు నమోదు చేయించాలని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు అన్నారు. పెదబోగిలి 1, 2 సచివాలయాల్లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు గుర్తించి వారిని ఆయా సచివాలయ సిబ్బంది దత్తత తీసుకున్న అధికారులు వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. శిశు మరణాల రేటు తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత నుంచి బయటపడేందుకు అధికారులు వారికి పౌష్టికాహారం, మిగతా విషయాలపై అవగాహన కల్పించి, వాటిని నివారించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, ఇఒ జి.వెంకట రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ

రక్తహీనత వ్యాధి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. మండలంలోని కొండాపురంలో మంగళవారం రక్తహీనత వ్యాధిపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య, సచివాలయ సిబ్బంది సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్యులు కమలనాథ్ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు అవసరమైన వైద్య సేవలను అందించాలని అన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు మంగళవారం తహశీల్దారు వరహాలు సందర్శించారు. 232మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 227మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆర్‌బికెలో ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - భామిని

బాలేరు రైతు భరోసా కేంద్రంలో జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్త కోట చంద్రశేఖర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతినిధి మెడిబోయిన చలపతిరావు మంగళవారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. రబీ సీజన్‌కు అవసరమయ్యే ఎరువులు ఆర్‌బికెలో అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఆర్‌బికెలలో ఎరువులు అమ్మకాలు చేపడుతున్నామని విఎఎ జ్యోతి తెలిపారు.

విద్యార్థుల మరణాలపై గవర్నర్‌కు వినతి

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

ఇటీవల కాలంలో ఆశ్రమ పాఠశాలల్లో జరుగుతున్న విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మానవ హక్కుల సంఘం, చైర్మన్‌కు వినతి పత్రాలు పంపించినట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర జిల్లా కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తెలిపారు. జిల్లాలోని ఐటిడిఎ పరిధిలోని గిరిజన విద్యా సంస్థల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు నిత్యం మృత్యువాత పడుతున్నారు. వారం రోజుల్లో నలుగురు విద్యార్థులు మృతి చెందినా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు ఎటువంటి నివారణా చర్యలు తీసుకోవడం లేదన్నారు. గతంలో 2017 నుంచి 2020 వరకు ఆదివాసీ ఆరోగ్యం పేరుతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతి గృహాలకు వైద్య సిబ్బందిని నియమించి గిరిజన విద్యార్థులకు వైద్య సేవలు అందించేందుకు గత రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆ వినతిలో పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ సేవలు నిలిపివేయడంతో విద్యార్థుల మరణాలు క్రమంగా పెరుగుతున్నాయని వివరించారు. దీనిపై స్పందించి ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్య ఆరోగ్య సిబ్బందిని నియమించాలని వినతి పత్రంలో కోరారు.

గాయత్రికి ఎంబిబిఎస్ పట్టా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన ప్రాంతంలో పుట్టిన గాయత్రి డాక్టర్ విద్యనభ్యసించి విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కాలేజీలో డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. ఈమె తండ్రి కె.శ్రీనివాసరావు పార్వతీపురం ఐటిడిఎ గిరిజన సంక్షేమ శాఖలో ఎటిడబ్ల్యూఒగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి విద్యలో చురుకైన పాత్ర పోషిస్తూ తాను డాక్టర్ కావాలన్న కల నిజం చేసింది గాయత్రి అన్నారు. తాను గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించాలన్న తపన ఉన్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను కూడా పూర్తి చేసి పిజి చేస్తానని తెలిపారు. గాయత్రి తల్లి గరుగుబిల్లి మండలంలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

నూర్పు మిషన్‌లో పడి మహిళ మృతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని నారాయణపురానికి చెందిన కోట్ల చిన్నమ్మడు (43) జొన్న చేను నూర్పు మిషన్లో పడి అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల్లోకి వెళ్లగా నారాయణపురం రెవెన్యూ పరిధిలో గల గోడు రాళ్ల గుడ్ల పొలంలో మంగళవారం జొన్న చేను పనులకు వెళ్లిన చిన్నమ్మడు తలకు ఉన్న జుట్టు మిషన్‌లో పడటంతో తలకు, శరీరానికి బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆమెకు కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన చిన్నమ్మడు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం / కురుపాం

కురుపాం మండలం గుమ్మ సమీపం వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తవలసకు చెందిన బోరు మెకానిక్ హెల్పర్ కేశవరావు విధులు ముగించే కొని తిరిగి ఇంటికి వెళ్తుండగా గుమ్మ గ్రామ ప్రధాని రహదారి వద్ద వాకింగ్ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను బైక్‌తో ఢీకొట్టాడు. ఈ సంఘటనలో బైక్ పై నుంచి కేశవరావు కిందపడ్డాడు. ఇదే సమయంలో అటువైపు నుంచి వస్తున్న ఆటో కేశవరావు పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయాలు పాలయ్యాడు. వాకింగ్ చేస్తున్న గుమ్మ గ్రామానికి చెందిన పరదేశి, ఉదయ్ కుమార్, కృష్ణ స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని వైద్యం కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి వైద్యం అందిస్తున్నారు.

వారపు సంతలో సూపర్ సిక్స్‌పై ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌లో మంగళవారం జరిగిన వారపు సంతలో మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ సూపర్ సిక్స్ పథకాలపై నిర్వహించిన ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి టి. జగదీశ్వరి హాజరై సూపర్ సిక్స్ పథకాల గురించి సంతకు వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా కావాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, కావున రానున్న ఎన్నికల్లో కచ్చితంగా టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు . కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె.మల్లేసు, టిడిపి నాయకులు రంజిత్ కుమార్ నాయక్, వెంపటాపు భారతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం పై టిడిపి ఆగ్రహం

పార్వతీపురంరూరల్ : మున్సిపాలిటీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలపై టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ్ చంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ కార్యక్రమం ప్రజల్లో తీసుకువెళ్లేందుకు వార్డుల్లో పర్యటిస్తూ మంగళవారం 9వ వార్డులో పర్యటించారు. వార్డులోని పలు వీధుల్లో కాలువల్లో పూడికతీయకపోవడంతో మురుగు నీరు వెళ్లే దారి లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ పారిశుధ్య అధికారులు, స్థానిక కౌన్సిలర్ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌవుతున్నారని, దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి, వార్డులోని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా 9వ వార్డు ప్రజలు సరైన మురుగు కాలువల్లేక రహదారుల పైన మురికి నీరు నిలిచిపోవడంతో ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వార్డు ప్రజలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు . కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



9వ వార్డులో నిల్వ ఉన్న మురుగునీటిని చూపుతున్న విజయచంద్ర



సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న జగదీశ్వరి

గిరిజన గ్రామాల్లో టిడిపి ప్రచారం

మండలంలోని సంగందొరవలస, బుదువాడ, టేకు లోవ, బిత్తటోంకి గిరిజన గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పార్వతీపురం నియోజకవర్గం జనసేన-టిడిపి ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బి.చంద్రమౌళి, కార్యదర్శి గురజాన చంద్రమౌళి, గంట సాయిరాంశంకారం, నేలపు సింహాచలం, గొట్టాపు వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

కోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతుందని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ టిఎన్ఎస్‌కె పాత్రో అన్నారు. మంగళవారం రస్తాకుంటు బాయి కృషి విజ్ఞాన కేంద్రంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని 200 మంది మహిళలకు కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి పిల్లలు పెంచే విధానాన్ని వివరించారు. వీటి వలన కుటుంబ పోషణకు కొంత ఆర్థికంగా ఉంటుందని, కావున ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్ర పనిముట్లు పంపిణీ

సీతంపేట : స్థానిక ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా భారతీయ చిరుధాన్యాల సంస్థ హైదరాబాద్ రాజేంద్రనగర్ చెందిన సంస్థ ఆర్థిక సహకారంతో గిరిజన రైతులకు సీనియర్ శాస్త్రవేత్త అధిపతి పి.సీతారాం చేతుల మీదుగా వ్యవసాయ యాంత్రీక పనిముట్లు పంపిణీ చేశారు. వీరఘట్టం, సీతంపేట, కుసిమి, కొత్త పనుకువలస, ధోనుభాయి తదితర గిరిజన గ్రామాల్లో రైతులకు ఈ పరికరాలను అందజేశారు. ఈ గిరిజన గ్రామాల్లో చిరుధాన్యాలు సాగు విస్తరణ పెంచడానికి, చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసుకోవడానికి అవసరమైన యంత్రపరికరాలు గిరిజన రైతులకు అందజేశారు. దీన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నీలిమ, లక్ష్మీనారాయణ, పిఎఒ హరికృష్ణ, పిహెచ్ఒ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థినిలకు మంగళవారం దిశా డిఎస్‌పి హర్షిత దిశా, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ దిశ యాప్ అత్యవసర సమయంలో మహిళలకు ఒక ఆయుధం లాంటిదన్నారు. తాను మీకు అవగాహన పర్చిన దిశ యాప్ అనేది మీ గ్రామాల్లో, మీ వీధుల్లో, మీ బంధువుల్లో మహిళల మొబైల్ ఫోన్‌కు దిశ యాప్ డౌన్లోడ్ చేసి వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి, పాఠశాల సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం మేలు

ప్రజాశక్తి - బలిజిపేట

సేంద్రియ వ్యవసాయంపై మహిళా సంఘ సభ్యులకు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంసిఆర్ పి.లక్ష్మి, ఐసిఆర్ తిరుపతిరావు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు ఉపయోగించడం వల్ల వ్యవసాయం దిగుబడి, ఎగుమతులు వాటి నష్టాలు సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల వ్యవసాయ అభివృద్ధి వాటి ఉపయోగం తదితర అంశాలపై సెక్షన్లో తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం ఉమామహేశ్వరరావు. వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.